సాక్షి కర్నూలు

బుధవారం ; 8 ; జనవరి ; 2025



శ్రీశైల దేవస్థానానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధి పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన కళకంతుల మచేంద్రరావు రూ.1,11,116 విరాళం అందజేశారు.



ఉత్సవానికి వేళాయె

వైష్ణవ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో నేటి నుంచి ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. IIలో



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,624.73
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 75.401
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 0
అవుట్ ఫ్లో	: 8,091

న్యూస్‌రీల్

ఉరుకుంద హుండీ ఆదాయం రూ. 45 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయ హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, హుండీ పర్యవేక్షణ అధికారి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కాలక్షేపపు మండపంలో ఈ కార్యక్రమం చేపట్టారు. 34 రోజులకు సంబంధించి ఓ హుండీ ద్వారా రూ.41,26,644, అన్నదానానికి సంబంధించిన మరో హుండీ ద్వారా రూ. 4,24,846 ఆదాయం వచ్చింది. వెండి 6.200 కేజీలు, బంగారం 19 గ్రాములు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ లెక్కింపులో దేవాలయ సిబ్బందితో పాటు ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు ఈరప్పస్వామి, మహదేవస్వామి, యూనియన్ బ్యాంకు సిబ్బంది, ఆదోని భ్రమరాంబా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆదోని సబ్ రిజిస్ట్రార్‌గా అరుణ్‌కుమార్



ఆదోని అర్బన్: ఆదోని సబ్ రిజిస్ట్రార్‌గా మంగళవారం అరుణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడున్న సబ్ రిజిస్ట్రార్ హజీమియాను అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో అధికారులు సస్పెండ్ చేశారు. ఆస్పరి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న అరుణ్‌కుమార్‌ను ఉన్నతాధికారులు ఆదోనికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. పక్కా పత్రాలు, ఆధార్‌కార్డు, వేలిముద్రలు ఉంటేనే కార్యాలయానికి రావాలన్నారు. ఎవరైనా నకిలీ పత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కొలువుల నోటిఫికేషన్ రద్దు

కర్నూలు(సెంట్రల్):జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయాల నియామకం కోసం 2024 ఫిబ్రవరిలో విడుదల చేసిన నోటిఫికేషన్‌ను పరిపాలన కారణాల రీత్యా రద్దు చేసినట్లు కలెక్టర్ పి.రంజితబాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించాలని అభ్యర్థులను కోరారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

- మార్కెట్‌లో పత్తికి గిట్టుబాటు ధర



ఆదోని అర్బన్: పత్తి కోతలు ప్రారంభమైనప్ప టి నుంచి మార్కెట్‌లో గిట్టుబాటు ధర రైతులు పొందలేదు. కేవలం సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే అరకొరగా లభించింది. మార్కెట్‌లో పత్తి ధర క్వింటం రూ. 7,200కు మించలేదు. కాగా మంగళవారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.7,500 పత్తి ధర పలికింది. ఈ మేరకు 3,131 క్వింటాళ్లు అమ్మకానికి రాగా, గరిష్ట ధర రూ.7,509, మధ్య ధర రూ.7,209, కనిష్ట ధర రూ.5,080గా నమోదయ్యింది. పత్తి గింజలకు డిమాండ్ పెరగడంతో ఈ ధర పలికిందని వ్యాపారవర్గాలు తెలిపాయి. అదేవిధంగా కందుల దిగుబడులు గత వారంలో రూ.7 వేలు ధర పలికింది. మంగళవారం కందులు 96 సంచులు (48 క్వింటాళ్లు) రాగా గరిష్ట ధర రూ.7,410, మధ్య ధర రూ.6,679, కనిష్ట ధర రూ.3,010గా పలికింది.

ట్రిపుల్ ఐటీడీఎంను సందర్శించిన విదేశీ ప్రొఫెసర్లు



ట్రిపుల్‌ఐటీడీఎం డైరెక్టర్ మూర్తి, ఫ్యాకల్టీలతో కొరియా, మలేషియా ప్రొఫెసర్లు

కర్నూలు సిటీ: సాంకేతికతో కూడిన విద్య, పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్(ట్రిపుల్ ఐటీడీఎం)ను విదేశీ వర్సిటీల ప్రొఫెసర్లు మంగళవారం సందర్శించారు. ఇక్కడ విద్యార్థులకు అందిస్తున్న పీజీ ప్రోగ్రాంలను, షార్ట్‌టర్మ్ కోర్సులను పరిశీలించారు. తర్వాత ట్రిపుల్ ఐటీ డీఎం డైరెక్టర్ ఆచార్య బీఎస్ మూర్తితో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ఐటీడీఎంను సందర్శించిన వారిలో కొరియా దేశానికి చెందిన జియోంగ్‌సాంగ్ నేషనల్ యూనివర్సిటీకి చెందిన ఆచార్యులు ఎస్.సుబ్బారెడ్డి, మలేషియాకు చెందిన కర్టిన్ యూనివర్సిటీ ఆచార్యులు మోహన్ రెడ్డి ఉన్నారు.

పైపై పూత.. నిధుల మేత

- గతుకులకు నాసిరకం అతుకులు
- వేసిన 10–15 రోజులకే లేచిపోయిన తారు
- జిల్లాలో రూ.31 కోట్లతో 821 కిలోమీటర్ల మేర పనులు మంజూరు
- మసిపూసి మారేడు కాయ చేస్తున్న కూటమి నేతలు
- నేటికి ప్రారంభం కాని పలు రోడ్ల పనులు
- చోద్యం చూస్తున్న అధికారులు



ఈ చిత్రం పత్తికొండ – గుత్తి రహదారిలో రాతన గ్రామంలో ప్యాచ్‌లు వేసిన ప్రదేశం. ఈ రహదారిలో రూ.13 లక్షలతో 9 కిలోమీటర్ల మేర ప్యాచ్ వర్క్‌లు చేపట్టారు. అయితే ప్యాచ్‌లు వేసిన 10–15 రోజుల్లోపే తారు కరిగి పోయి మళ్లీ గుంతలు దర్శనమిస్తున్నాయి. దీన్ని బట్టి చూస్తే రోడ్ల ప్యాచ్‌ల నాణ్యత ఏ పాటిదో ఇట్టే అర్థమవుతోంది.

కర్నూలు(అర్బన్)/ న్యూసిటీ: ఎన్నికలకు ముందు రహదారుల నిర్వహణపై నానా హంగామా చేసిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక ... కొత్త రోడ్ల మాట దేవుడెరుగు, చేస్తున్న ప్యాచ్ వర్క్‌లపై కూడా పర్యవేక్షణ లోపించింది. ప్యాచ్‌లు వేసిన వారం పది రోజులకే తారు, కంకర వేర్వేరై పోయి యథా ప్రకారం గుంతలు దర్శనమిస్తున్నాయి. కేవలం రోడ్లలో ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపట్టారు కానీ, ఆయా పనులు కూడా పూర్తి నాణ్యతతో చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్టేట్ హైవేస్, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లపై కూడా పనులు అంతంత మాత్రంగానే చేపడుతున్నారు. ఎస్‌హెచ్, ఎండీఆర్ రోడ్ల పరిస్థితే ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ అండ్‌బీ రోడ్లకు కేవలం పైపూతలు పూస్తు మమ అనిపిస్తున్నారు. మిషన్ పార్ట్ హోల్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా జిల్లాలోని కర్నూలు, ఆదోని డివిజన్లలో మొత్తం 821 కిలోమీటర్ల మేర రూ.31 కోట్లతో పనులు మంజూరు కాగా, రూ.20.66 కోట్లతో 163 పనులను చేపట్టారు. గత ఏడాది నవంబర్ 2వ తేదీన ప్రారంభించిన ఈ పనుల్లో ఇప్పటి వరకు 504 కిలోమీటర్ల మేర ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

నాసిరకంగా పనులు ...

జిల్లాలోని పలు రోడ్లపై పనులు పూర్తి నాసిరకంగా చేపడుతున్నారు. దీంతో ఆయా రోడ్లపై పూడ్చిన గుంతల్లో ఇప్పటికే కంకర బయట పడడంతో వాహనదారుల ఇబ్బందులు తిరిగి ప్రారంభమయ్యాయి. చేస్తున్న పనులపై అధికారుల పర్యవేక్షణ లోపించడంతో కాంట్రాక్టర్ల అవతారమెత్తిన కూటమి నేతలు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. మరికొన్ని రోడ్లపై అసలు పనులే ప్రారంభించ లేదు. మరో పది రోజుల్లో చేపట్టిన అన్ని రోడ్ల పనులను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇంకా అధికారుల లెక్కల ప్రకారం కర్నూలు డివిజన్‌లో 25 శాతం, ఆదోని డివిజన్‌లో 45 శాతం పనులను సంక్రాంతి పండుగ నాటికి (కేవలం 10 రోజులు) ఎలా పూర్తి చేస్తారో వారే చెప్పాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే చేసిన పనులకు కూడా పలు ప్రాంతాల్లో బిల్లులు చెల్లించనట్లు తెలుస్తోంది. ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిలో 50 కిలోమీటర్ల మేర చేపట్టిన ప్యాచ్ వర్క్‌లకు రూ.80 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

జిల్లాలో చేపట్టిన ప్యాచ్ వర్క్‌ల వివరాలు ...
(స్టేట్ హైవేస్, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు)

డివిజన్	మొత్తం వర్క్‌లు	మొత్తం కిలోమీటర్లు	విలువ (రూ.లక్షల్లో)	అగ్రిమెంట్ చేసుకున్న పనులు	పూర్తి చేసిన కిలో మీటర్లు
కర్నూలు	47	204.041	874.77	44	154.900
ఆదోని	133	617.843	2,274.82	119	349.197
మొత్తం	180	821.884	3,149.59	163	504.097



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ప్రస్తుత డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి స్వగ్రామమైన లద్దగిరికి వెళ్లే రోడ్డు. ఈ రహదారి పూర్తి స్థాయిలో ఛిద్రం కావడంతో ఆర్‌టీసీ బస్సులను నడిపేందుకు అధికారులు హడలెత్తిపోతున్నారు. వెంకటగిరి – గోరంట్ల గ్రామాల మధ్య వాహనాలు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వెంకటగిరి నుంచి నాలుగు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి చిల్లబండ క్రాస్ నుంచి గోరంట్లకు ఆర్‌టీసీ బస్సులు చేరుకుంటున్నాయి.

సీ బెళగల్ మండలం పోలకల్ నుంచి ముడుమాల వరకు కిలోమీటరు 3/5 నుంచి 5/6 వరకు (2.10 కిలోమీటర్లు) బీటీ రోడ్డుకు ప్యాచ్ వర్కులు చేపట్టేందుకు రూ.12 లక్షలు మంజూరయ్యాయి. అయితే నేటికి పనులు ప్రారంభం కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పలు గ్రామాల ప్రజలు ఈ రోడ్డుపై ప్రయాణిస్తూ అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాగా ఈ పనులకు సంబంధించి వెట్ మిక్స్ స్టాట్ చేశామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.



పత్తికొండ – ఆదోని రోడ్డులో రూ.5 లక్షల వ్యయంతో ఏడు కిలోమీటర్ల మేర పలు చోట్ల ప్యాచ్ వర్కులు చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే పలు ప్రాంతాల్లో వేసిన ప్యాచ్‌లు వేసినట్లుగా ఇలా ఛిద్రమయ్యాయి.



అంచనా మొత్తం కూడా పెంచి...

పలు ప్రాంతాల్లో చేపడుతున్న పనుల అంచనా మొత్తాన్ని కూడా పెంచినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక కూటమి నేతల జేబులు నింపేందుకు అంచనాలు రూపొందించినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. తక్కువ ప్యాచ్ వర్కులు ఉన్న రోడ్లకు కూడా రూ. లక్షలు వెచ్చిస్తున్నారు. పైగా జంగిల్ క్లియరెన్స్, గుంతలు పూడ్చడం పనులతో చోటా నేతలకు ముందే సంక్రాంతి వచ్చిందనే విమర్శలు ఉన్నాయి.

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో సభ్యుల ఆందోళన ...

గత నెల 28వ తేదీన జరిగిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో మెజార్టీ జెడ్పీటీసీ సభ్యులు అధ్వాన రోడ్లపై ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో చేపట్టిన ప్యాచ్ వర్కుల్లో కర్నూలు డివిజన్‌లో 75 శాతం, ఆదోని డివిజన్‌లో 55 శాతం పూర్తయ్యా యని ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ చెబుతుండగా.. పలువు రు జెడ్పీటీసీలు అడ్డుతగిలారు. కర్నూలు జిల్లా కోడుమూరు – వెల్దుర్తి, మద్దికెర – బురుజుల, మద్దికెర– కసాపురం, మిడ్తూరు – గార్గేయపురం రోడ్లతో పాటు నంద్యాల జిల్లాలోని నందికొట్కూరు– పగిడ్యాల, గడివేముల – మంచాలకట్ట, మహానంది మండలంలో పలు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని సమావేశం దృష్టికి తీసుకెళ్లారు.



నాగలాపురం - గోరంట్ల రోడ్డులో నాసిరకంగా వేసిన ప్యాచ్

ఏపీ గురుకులలో లైంగిక వేధింపులపై విచారణ



విద్యార్థినులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ కళ్యాణి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీలో విద్యార్థినులపై జరిగిన లైంగింక వేధింపుల ఘటనపై మంగళవారం ట్రైనీ కలెక్టర్ కళ్యాణి విచారణ చేపట్టారు. ముందుగా ఆమె కాలేజీలోని తరగతి గదులు, ల్యాబ్, లైబ్రేరి, వంట గదులు, డార్మెటరీ, వాష్ రూమ్‌లను కలియ తిరిగి పరిశీలించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అక్కడ పనిచేసే సిబ్బందిని విచారించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. సమస్యలు, లైంగిక వేధింపులపై నిజాలే చెప్పాలని కోరగా వారు కాలేజీలో జరిగిన విషయాన్ని క్షుణ్ణంగా వివరించారు. అనంతరం ట్రైనీ కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ చీఫ్ సెక్రటరీ ఆదేశాల మేరకు కాలేజీలో విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనపై విచారణకు వచ్చినట్లు చెప్పారు. ఇక్కడ విద్యార్థినులు చాల సమస్యలు ఎదుర్కొంటున్నారని, అందులో మౌలిక సదుపాయాల లేమి కూడా ఒకటని అన్నారు. లైంగిక వేధింపులపై జరిపిన విచారణ నివేదికలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు అందజేస్తానని చెప్పారు. అనంతరం ఐసీడీఎస్ వారు తెచ్చిన హెల్ప్‌లైన్ ఫోన్ నెంబర్ల పోస్టర్‌ను కాలేజీలో అతికించారు. ఏమైనా సమస్య ఉంటే అందులోని నంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తారని విద్యార్థినులకు భరోసా ఇచ్చారు. ట్రైనీ కలెక్టర్ వెంట డీసీపీవో శారద, డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్, వీఆర్వో మోహన్, ఐసీడీఎస్ సీడీపీఓ సఫర్నీసాబేగం, సూపర్ వైజర్ ప్రీతి తదితరులు ఉన్నారు.

నేడు రైల్వే అభివృద్ధి పనులకు పీఎం మోదీ శంకుస్థాపన

- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని



కర్నూలు(సెంట్రల్/డోన్ రూరల్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం విశాఖపట్నం పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆర్‌ఎస్ పెండేకల్ - గుత్తి, డోన్ - మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనులను మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటికే కాచిగూడ నుంచి మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. డోన్ మహబూబ్‌నగర్ మధ్య ఈ పనులు పూర్తయితే రైలు ప్రయాణ సమయం తగ్గనుంది. దాదాపు 150 కి.మీ ఉండగా 20 స్టేషన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ మార్గం మొత్తం సింగిల్ లైన్ కావడంతో పలు రైళ్లను క్రాసింగ్‌లకు ఆయా స్టేషన్లలో నిలిపివేయాల్సి వస్తోంది. డబ్లింగ్ పూర్తయితే క్రాసింగ్‌లు లేకపోవడంతో పాటు రైళ్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ఇస్తెమా షురూ



ఇస్తెమా ప్రాంగణంలో నమాజు చేస్తున్న ముస్లింలు

- ఆత్మకూరుకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివస్తున్న ముస్లింలు

ఆత్మకూరు: పట్టణ శివారులో మూడురోజుల ఇస్తెమా ప్రారంభమైంది. తొలి రోజే వేలాది మంది తరలివచ్చారు. కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, కడప, ప్రకాశం జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా ముస్లింలు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఇప్పటికే లక్ష మంది వరకు ముస్లింలు చేరుకోవడంతో ఇస్తెమా ప్రదేశం కిటకిటలాడుతోంది. మంగళవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు మాట్లాడుతూ ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని, ఆయన బోధనలను పాటించాలని చెప్పారు. సత్ప్రవర్తనతో మెలిగి ధర్మం, న్యాయం, సమానత్వాన్ని కాపాడాలన్నారు. ఐదుపూటల నమాజ్ చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో జీవితాన్ని గడపాలని సూచించారు.

బయాన్ సమయం

ఆత్మకూరు పట్టణంలో నిర్వహిస్తున్న ఇస్తెమాలో ఉదయం 6.15 నుంచి 8 గంటల వరకు, ఉదయం 10 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు, 5 నుంచి 6 గంటల వరకు, రాత్రి 6.10 నుంచి 9 గంటల వరకు బయాన్ కార్యక్రమం ఉంటుందని ఇస్తెమా కమిటీ సభ్యులు తెలిపారు. హైదరాబాద్, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన మత పెద్దలు వివిధ అంశాలపై ప్రసంగిస్తారన్నారు.



ఇస్తెమా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

ఇస్తెమా ప్రదేశాన్ని, ఏర్పాట్లను నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా మంగళవారం పరిశీలించారు. పెద్ద సంఖ్యలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు 500 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధులకు నియమించామన్నారు.

అంకితభావంతో అభివృద్ధికి కృషి

- వనరుల సద్వినియోగంతో రూ.12 కోట్లకు చేరిన జెడ్పీ ఆదాయం
- వ్యవసాయం, తాగునీరు, గృహ నిర్మాణానికి ప్రాధాన్యత
- మూడేళ్ల పాలనపై జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి



కర్నూలు(అర్బన్): అత్యంత పారదర్శకంగా, ఎలాంటి అవినీతికి తావు లేకుండా జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నామని జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఈ నెల 4వ తేదీకి జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి మూడు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం ఆయన జెడ్పీలోని తన చాంబర్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాపిరెడ్డి మాట్లాడుతూ.. పెద్దగా ఆదాయ వనరులు లేని జిల్లా పరిషత్‌కు ఆర్థిక జవసత్వాలు తీసుకువచ్చేందుకు అందరి సహకారంతో పనిచేస్తున్నామన్నారు. 2014-15 నుంచి 2020-21 వరకు రూ.6 కోట్లకు మించని జిల్లా పరిషత్ ఆదాయాన్ని రూ.12 కోట్లకు తీసుకువచ్చామన్నారు. ముఖ్యంగా జెడ్పీ స్థిరాస్థులకు సంబంధించిన, స్టాంప్ డ్యూటీ, సీనరేజి గ్రాంట్, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఇతరత్రా వనరులతో జెడ్పీ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. జెడ్పీ సర్వసభ్య సమావేశాలు, స్థాయీ సంఘ సమావేశాల్లో ప్రజా అవసరాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా ఇప్పటి వరకు నిర్వహించిన 10 సర్వసభ్య సమావేశాల్లో ఏడు పర్యాయాలు తాగునీరు, వ్యవసాయం, హౌసింగ్‌పై సమీక్షలు నిర్వహించామన్నారు. ప్రతి సమావేశంలోనూ అర్థవంతమైన చర్చలు జరుగుతున్నాయన్నారు.

తాగునీటి పథకాల నిర్వహణకు రూ.211.44 కోట్లు ...

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 60 సీపీడబ్ల్యూఎస్ పథకాల ద్వారా 663 ఊర్లకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామని జెడ్పీ చైర్మన్ అన్నారు. ఈ పథకాల నిర్వహణకు 15వ ఆర్థిక సంఘం నిధులు 2021-22 నుంచి 2023-24 వరకు రూ.211.44 కోట్లు వెచ్చించామని, 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.85.71 కోట్లు వెచ్చించేందుకు పరిపాలనా ఆమోదం జారీ చేశామన్నారు. అలాగే గడిచిన మూడేళ్లలో 99 పనులు చేపట్టగా, ఇప్పటి వరకు రూ.4,11,46,528 ఖర్చు చేసి 72 పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. జెడ్పీ ఆదాయాన్ని పెంచేందుకు జిల్లా పరిషత్ పాత భవనాన్ని ఏపీ టూరిజం కార్పొరేషన్‌కు అద్దెకు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఈ భవనంలో కన్‌స్ట్రక్షన్ ఒక ఎస్‌ఎఫ్‌టీ రూ.15, ఖాళీ స్థలం రూ.7.50 కు ఇచ్చేందుకు పాలక వర్గం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ విషయాన్ని ఇటీవలే ఏపీ టూరిజం కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలిని కలిసి విన్నవించామన్నారు. అలాగే జిల్లా పరిషత్ ముందు భాగంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి ఆలోచిస్తున్నామన్నారు.

చలి.. పులి

- గూడూరులో అత్యల్పంగా 11.6 డిగ్రీలు

కర్నూలు(అగ్రికల్చర్): సంక్రాంతి ముంగిట చలి గజగజలాడిస్తోంది. సాధారణ ఉష్ణోగ్రతలు రాత్రి 14–16 డిగ్రీలు, పగలు 34–35 డిగ్రీల వరకు ఉండాల్సి ఉంది. అయితే కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతున్నాయి. రానున్న వారం రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో జిల్లాలో విద్యుత్ వినియోగం గణనీయంగా పడిపోయింది.మంగళవారం గూడూరులో అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు అయింది. రాత్రి ఉష్ణోగ్రత 11.6 డిగ్రీలు, పగటి ఉష్ణోగ్రత 32.3 డిగ్రీలు నమోదు అయింది. అత్యల్ప ఉష్ణోగ్రతలు ఎమ్మిగనూరులో 12, హాలహర్విలో 12.1, కోసిగిలో 12.3, కౌతాళంలో 12.9, ఆదోనిలో 13.1, కల్లూరులో 13.3, పెద్దకడుబూరులో 13.4, దేవనకొండలో 13.5 డిగ్రీల ప్రకారం నమోదు అయ్యాయి.

జెడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనం విడుదల

కర్నూలు(అర్బన్): ఉమ్మడి జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులకు ఏడు నెలల గౌరవ వేతనాన్ని ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. 2024వ సంవత్సరానికి సంబంధించి జూన్ నుంచి డిసెంబర్ వరకు నెలకు రూ.6 వేల ప్రకారం మొత్తం 52 మంది జెడ్పీటీసీలకు రూ.29,38,818 విడుదలయ్యాయన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌లో ఐదుగురు అరెస్ట్

- పరారీలో మరో ఐదుగురు

ఆదోని అర్బన్: జిల్లాలో సంచలనం సృష్టించిన ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో అరెస్ట్‌ల పర్వం మొదలైంది. బతికున్న ఎగ్గటి ఈశ్వరయ్య పేరుతో నకిలీ మరణ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తో రూ.35 కోట్లు విలువచేసే 6.51 ఎకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులో పది మందిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మంగళవారం ఐదుగురిని అరెస్టు చేయగా, మరో ఐదుగురు పరారీలో ఉన్నారని సీఐ సూర్య మోహన్‌రావు తెలిపారు. అరెస్టు అయిన వారిలో రిజిస్ట్రేషన్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఈరన్న, జూనియర్ అసిస్టెంట్ రమేష్, డాక్యుమెంట్ రైటర్లు షేక్ మహబూబ్, షేక్ షబ్బీర్, విట్‌నెస్‌గా ఉన్న ఇజాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. పరారైన వారిలో సబ్ రిజిస్ట్రార్ హాజీమియా, రిజిస్ట్రేషన్ చేయించిన ఎగ్గటి ఆముదాల భాస్కర్, చేసుకున్న చాకలి ఈరన్న, సాక్షులు ఈరన్న, లోకనాథ్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. త్వరలో ఈ ఐదుగురిని కూడా పట్టుకుంటామని సీఐ తెలిపారు.

క్లుప్తంగా

ఆలయ రాజగోపురానికి రూ. 6.75 లక్షల విరాళం


ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న దాతలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్లలోని గాంధీసెంటర్‌లో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయ రాజగోపురానికి పట్టణానికి చెందిన పలువురు దాతలు మంగళవారం విరాళం అందజేశారు. పట్టణానికి చెందిన దివంగత గుద్దేటి మొలక రామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన వారసులు, ప్రస్తుత ఆలయ ధర్మకర్త గుద్దేటి కృష్ణారెడ్డి, దివంగత గుద్దేటి నరసింహారెడ్డి భార్య రామలింగమ్మ, కోడలు అందె లక్ష్మీప్రసన్న, దివంగత గడ్డం అంకిరెడ్డి కుమారుడు గడ్డం రామకృష్ణారెడ్డి, కుటుంబ సభ్యులు, దివంగత ముక్కమల్ల శివారెడ్డి కుమారుడు పెద్దిరెడ్డి ఆలయ కమిటీకి రూ. 6.75 లక్షల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రాముస్వామి, కమిటీ సభ్యులు గువ్వల రామకృష్ణారెడ్డి, గుద్దేటి వెంకటసుబ్బారెడ్డి, శివశంకర్‌రెడ్డి, రామకృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి, వాసగిరి అమర్ పాల్గొన్నారు.

హోటళ్లపై విజిలెన్స్ దాడులు

పాణ్యం: మండల కేంద్రంలోని హోటళ్లపై మంగళవారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. పలు హోటళ్లలో నిబంధనలు అతిక్రమించి డొమెస్టిక్ వంటగ్యాస్ సిలిండర్లు వాడుతుండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలో 13 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హోటళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. విజిలెన్స్ అధికారి విశ్వనాథ్, డీటీ శివశంకర్ రెడ్డి, ఆర్‌ఐ రామ్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి


గాయపడిన జయలక్ష్మి

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లెలో అంగన్‌వాడీ కార్యకర్తపై అదే గ్రామానికి శివకుమార్ దాడి చేసినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. మంగళవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న జయలక్ష్మి వద్దకు వెళ్లిన శివకుమార్ మాట్లాడుతూనే ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. దాడిలో ఆమె ముఖానికి గాయాలు కావడంతో నంద్యాల జీజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి వెళ్లి జరిగిన ఘటనపై ఆరా తీశారు. కోడిగుడ్లు ఇవ్వలేదనే కారణంతో శివకుమార్ దాడి చేసినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శివకుమార్ బేతంచెర్ల మండలంలో ఉపాధి హామీ పథకం టీఏగా పని చేస్తున్నాడు. ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

వరాల దేవుడి ఉత్సవాలకు వేళాయె!

- నేటి నుంచి మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు
- ఈ ఏడాది నాలుగురోజుల పాటు నిర్వహణకు ఏర్పాట్లు
- వైఎస్సార్‌సీపీ హయాంలో ఆలయ అభివృద్ధికి బాటలు

బేతంచెర్ల: పిలిస్తే పలికే దైవంగా, వరాలు ఇచ్చే స్వామిగా మద్దిలేటి నరసింహస్వామికి పేరు. బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్ రంగాపురం శివారులోని ఎర్రమల కొండల్లో వెలసిన ఈ స్వామిని దర్శించుకునేందుకు నిత్యం భక్తులు వస్తుంటారు. రాయలసీమ జిల్లాలతో పాటు మహబూబ్‌నగర్ నుంచి అధిక సంఖ్యలో వస్తుంటారు. ఆయా ప్రాంతాల్లోని పలువురు తమ ఇలవేల్పుగా భావించి మద్దిలేటి, మదన భూపాల్, మాధవ్, మద్దమ్మ, మద్దయ్య, మధుసూదన్ తదితర పేర్లు పెట్టుకుంటుంటారు. ఉమ్మడి జిల్లాలో వైష్ణవ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ఈనెల 8 నుంచి 11వరకు ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు జరుగనున్నాయి.

ఆలయ చరిత్ర ఇదీ..

ఆర్‌ఎస్ రంగాపురం శివారులో ప్రకృతి కొండ కోనల నడుమ గలగల పారే సెలయేరు పక్కన వెలసిన ఈస్వామిని మొదటగా కదిరి నరసింహస్వామి అవతారంగా చెప్పుకుంటారు. ఒకరోజు స్వామి, అమ్మవార్లు ఇరువురు ఆనంద సమయంలో పాచికలు ఆడుతుండగా స్వామివారిపై అమ్మవారు విజయం సాధిస్తుంది. ఆసమయంలో విజయగర్వంతో స్వామి వారిని హేళనతో చూడటంతో ఆయన అవమానం భరించలేక ఒక మంచి ప్రశాంత పుణ్య స్థలంలో వెలసి భక్తుల కోరికలు తీర్చాలని నిర్ణయించుకుంటారు. ఈ క్రమంలో యాగంటి క్షేత్రానికి చేరుకొని అక్కడ వెలసిన ఉమామహేశ్వరస్వామికి విషయం చెప్పగా ఆయన గలగలపారే మద్దిలేరు వాగు పక్కన స్థలం చూపుతారు. ఆ తర్వాత నరసింహస్వామి మద్దిలేరు వాగు పక్కన వచ్చి వెలసినందుకు మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంగా పేరొచ్చిందని పురాణాలు చెబుతున్నాయి.



మద్దిలేటిస్వామి ఆలయం ఏరియల్ వ్యూ (ఇన్‌సెట్) మద్దిలేటి నరసింహస్వామి


నేటి నుంచి ముక్కోటి ఏకాదశి వేడుకలు

2009 నుంచి క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలను ఈసారి 4వ రోజులు జరపనున్నారు. 8వ తేది ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, సాయంత్రం 6 గంటలకు, హనుమద్ వాహన సేవ, 9న శ్రీదేవి,భూదేవి,సమేత మద్దిలేటిస్వామికి ప్రత్యేక పూజలతో పాటు సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ, గజ వాహనంపై ఉత్సవమూర్తుల ఊరేగింపు ఉంటుంది. 10 వ తేది తెల్లవారుజామున 3గంటలకు స్నప్న తిరుమంజనం, విశేష పుష్పాలంకరణ, 4 గంటలకు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం, 11:00 గంటలకు భూ, నీలా సమేత ఘణ మద్దిలేటిస్వామి అమ్మవార్లకు శాంతి కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. 11 వ తేదీ పుష్యశుద్ధ ద్వాదశిని పురస్కరించుకుని ఆలయ పుష్కరిణిలో చక్ర స్నానం, సాయంత్రం తెప్పోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసినట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో మహర్దశ

ఎంతో విశిష్టత కలిగిన మద్దిలేటయ్య క్షేత్రం అభివృద్ధి వైఎస్సార్‌సీపీ హయాంలో పరుగులు పెట్టింది. కోట్లాది రూపాయలతో పలు పనులు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే మంత్రిగా ఉన్న బుగ్గన రూ. 2.50 కోట్లతో అమ్మవారి ఆలయ పునరుద్ధరణ పనులు, రూ.7.40 కోట్లతో భక్తుల సౌకర్యార్థం 72 గదుల కాటేజీ నిర్మాణం. రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు రూ.9. 50 కోట్లతో డబుల్ రోడ్డు పనులు చేపట్టారు. అంతేకాకుండా 3.90 కోట్లతో స్వామి ఆలయ పునర్నిర్మాణం, ఆలయం వరకు ఉన్న బైపాస్ రోడ్డు నుంచి స్వామి వారి చెంతకు మరో రూ.2 కోట్లతో సీసీ రోడ్డు వేయించారు. క్షేత్రం వైభవాన్ని చాటేలా ఆర్‌ఎస్ రంగాపురం వద్ద నూతనంగా రూ.2.50 కోట్లతో ఆర్చీ గేటు, రూ.12.70 కోట్లతో అమ్మవారి, స్వామి వారి ఆలయం చుట్టు శ్రీ చక్రం ఆకారంలో మహా ప్రకారం, మండపం , 3 రాజగోపురాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సకల సౌకర్యాల కల్పనతో భక్తుల తాకిడి, ఆలయం ఆదాయం ఏటేటా పెరుగుతూ వస్తోంది.


ఆలయ కొండల మధ్యన పుష్కరిణి


తిరుమల గిరులను తలపించేలా ఆలయ పరిసరాలు

వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా అస్లాం

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం పార్టీ అధ్యక్షుడిగా పీ.ఎం .ఉమర్ అస్లాం (కోడుమూరు) నియమితులయ్యారు. మంగళవారం రాత్రి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

వ్యవసాయం పరిజ్ఞానం పెంచుకోవాలి


మాట్లాడుతున్న ఆత్మ పీడీ రత్నప్రసాద్

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు దేశీ డిప్లొమా కోర్సు ఎంతో ఉపయోగపడుతుందని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ రత్నప్రసాద్ అన్నారు. ఇన్‌పుట్ డీలర్లలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచేందుకు ఆత్మ ద్వారా దేశీ డిప్లొమా కోర్సు కింద 48 వారాల పాటు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో నూతనంగా ఏర్పాటైన బ్యాచ్‌కు శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆత్మ పీడీ రత్నప్రసాద్ మాట్లాడుతూ.. ఇక నుంచి వ్యవసాయ శాఖలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలరుగా లైసెన్స్ పొందాలంటే దేశీ డిప్లొమా కోర్సులో శిక్షణ పొంది ఉండాలన్నారు. నూతన బ్యాచ్‌లో 20 మంది ఇన్‌పుట్ డీలర్లు, మరో 20 మంది నాన్ డీలర్లు ఉన్నారని, వీరందరూ వారానికోసారి జరిగే శిక్షణా కార్యక్రమానికి విధిగా హాజరు కావాలన్నారు. తక్కువ ఖర్చుతో అధిక ఉత్పాదకత సాధించేందుకు ఈ కార్యక్రమం తోడ్పడుతుందని వివరించారు. ఆత్మ డీపీడీ శ్రీలత, దేశీ డిప్లొమా కోర్సు సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఎన్నికలు

- టీడీపీ ఆరోపణలు అవాస్తవం
- స్పష్టం చేసిన విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి, డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి

ఆళ్లగడ్డ: టీడీపీ నేతలు ఆరోపిస్తున్నట్లు రుద్రవరం మండలం మాచినేనిపల్లె, చాగలమర్రి మండలం నగల్లపాడు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నికల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని ఆ సంఘాల అధ్యక్షులు ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, గంగుల విజయసింహారెడ్డి స్పష్టం చేశారు. వారు మంగళవారం మాట్లాడుతూ.. మాచినేనిపల్లె, నగల్లపాడు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ఎన్నికలు నిబంధనల మేరకు మాక్స్ చట్ట పరిధిలోనే జరిగాయన్నారు. కాల పరిమితి ముగిసిన సొసైటీలకు ఎలా ఎన్నికలు జరిగాయో అలాగే మాచినేనిపల్లె, నగల్లపాడు సొసైటీలకు కూడా జరిగాయని చెప్పారు. చాగలమర్రి మండలం చక్రవర్తులపల్లె సొసైటీ అధ్యక్షుడు భూమా జగత్‌విఖ్యాత్ రెడ్డి ఎన్నిక రద్దు విషయం పక్కదారి పట్టించేందుకు టీడీపీ నేతలు తప్పుడు ప్రచారానికి తెరలేపడం విచారకరమన్నారు. విజయ డెయిరీ నుంచి రూ.1.30 కోట్లు రుణం తీసుకుని తిరిగి చెల్లించకపోవడంతో పాటు జగత్ డెయిరీలో భాగస్వామిగా ఉంటూ చక్రవర్తులపల్లె పాల సొసైటీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నిబంధనల ప్రకారం అర్హత లేకపోవడంతోనే సభ్యుల తీర్మానం మేరకు భూమా విఖ్యాత్‌రెడ్డి ఎన్నికను రద్దు చేసినట్లు చెప్పారు. మాచినేనిపల్లె పాల కేంద్రం ఎన్నిక అక్రమమంటూ టీడీపీ నేత హైకోర్టును ఆశ్రయించగా కో–ఆపరేటివ్ యాక్ట్ ప్రకారం ఆ సొసైటీలో సభ్యులు కూర్చొని చర్చించుకోవాలని కేసును కొట్టివేసిందన్నారు. ఇప్పటికైనా రాజకీయ ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు

ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేస్తా


ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(అర్బన్): నంద్యాల రూరల్ తహసీల్దార్ కార్యాలయ ప్రారంభోత్సవానికి తనను పిలవకపోవడం ప్రొటోకాల్ ఉల్లంఘించడమేనని, దీనిపై శాసన మండలి ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేయనున్నట్లు ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా వెల్లడించారు. మంగళవారం పట్టణంలో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో రూరల్ తహసీల్దార్ కార్యాలయ ప్రారంభోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా మంత్రులతో పాటు అధికారులకు ఆహ్వానాలు పంపిన రెవెన్యూ అధికారులు ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాను విస్మరించారు. ఈ ఘటనపై ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా స్పందిస్తూ.. రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ ప్రతిపక్ష పార్టీకి చెందిన ప్రజాప్రతినిధిని ప్రారంభోత్సవ కార్యక్రమానికి పిలవకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రొటోకాల్ ఉల్లంఘన విషయాన్ని శాసన మండలి చైర్మన్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ప్రారంభోత్సవాల్లో రాజకీయాలు జోడించవద్దని, ప్రజాప్రతినిధులకు ఇవ్వాల్సిన గౌరవం ఇస్తే సబబుగా ఉంటుందని సూచించారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య


భర్త, కుమార్తెతో శైలజ (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని పూలబజార్‌లో నివాసముంటున్న శైలజ (22) అనే వివాహిత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై మృతురాలి తండ్రి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మూడున్నర సంవత్సరాల క్రితం విక్టోరియాపేటకు చెందిన కృష్ణ కుమార్తె శైలజ, శక్తి గుడి ప్రాంతంలో నివాసముంటున్న నాగరాజు ప్రేమ పెళ్లి చేసుకున్నారు. నాగరాజు ఓ ప్రయివేట్ కంపెనీలో గుమస్తాగా పనిచేస్తుండగా, శైలజ లేడీస్ కార్నర్‌లో పని చేస్తోంది. వీరికి రెండేళ్ల కుమార్తె మౌనిక ఉంది. భర్త ప్రతిరోజూ భార్యపై అనుమానం పడడం, లేడీస్ కార్నర్‌లో పనిచేయగా వచ్చిన డబ్బు తనకే ఇవ్వాలని వేధించేవాడు. దీంతో శైలజ మనస్తాపానికి గురై సోమవారం రాత్రి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కాసేపటికి గమనించిన కుటుంబసభ్యులు కిందకు దింపి ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ తెలిపారు.

మైనింగ్ అధికారుల దాడులు

- మట్టి, బండలను అక్రమంగా తరలిస్తున్న వాహనాలు సీజ్


ఓర్వకల్లు పోలీసుస్టేషన్‌లో ఉంచిన వాహనాలు

ఓర్వకల్లు: అధికారుల అనుమతి లేకుండా, అక్రమంగా మట్టి తవ్వకాలు, బండలతో వెళుతున్న వాహనాలను మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. కర్నూలు గనులు, భూగర్భ వనరుల శాఖ అధికారి రామచంద్రుడు ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ రహదారిపై ఓర్వకల్లు పోలీసు స్టేషన్ ఎదురుగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో బేతంచెర్ల నుంచి కర్నూలు వైపు బండల లోడుతో వెళుతున్న ఏపీ 39 యూపీ 2788 నంబర్ గల లారీ, అదేవిధంగా ఏపీ 39 టీటీ 0599 నంబర్ గల లారీలు రాయల్టీ చెల్లించకుండా అక్రమంగా బండలను తరలిస్తుండటంతో వాటిని సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. అదేవిధంగా పుట్టగొడుల ఫ్యాక్టరీ వద్ద నుంచి ఏపీఐఐసీకి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఏపీ 28 టీసీ 8076 నంబర్ గల టిప్పర్, అలాగే ఏపీ 29 టీవై 5757 నంబర్ గల మరో టిప్పర్‌ను సీజ్ చేశారు. సదరు వాహనాలను స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు


కొత్తకోట వద్ద గాయపడిన వెంకటేశ్వర రెడ్డి


యు.కొత్తపల్లి వద్ద గాయపడిన యువకుడు

డోన్ రూరల్: మండల పరిధిలోని కొత్తకోట గ్రామం సమీపంలోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం కారు బోల్తా పడిన ప్రమాదంలో బెంగళూరుకు చెందిన వెంకటేశ్వరరెడ్డికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. అతడు హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వ్యక్తిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. అలాగే యు.కొత్తపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు అదుపు తప్పి కింద పడటంతో గాయాలపాలయ్యారు. స్థానికులు వారిని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన యువకులు పట్టణంలోని కొండపేటకు చెందిన శివ, శివకుమార్‌గా తెలిసింది. వీరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. ఆయా ప్రమదాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వలస కార్మికుడి ఆత్మహత్య


మృతి చెందిన దూర్జన్ బెహరా

వెల్దుర్తి: మండల పరిధిలోని రత్నపల్లె గ్రామ సమీపంలో ఇటుకల బట్టీలో పనిచేసే వలస కార్మికుడు దూర్జన్ బెహరా (42) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రవి అనే వ్యక్తికి చెందిన ఇటుకల బట్టీలో పనిచేసేందుకు ప్రతి సీజన్‌లో సొంత రాష్ట్రం నుంచి ఒంటరిగా వచ్చే దూర్జన్ బెహరా ఎప్పటిలాగే నెల రోజుల క్రితం బట్టీలో పనికి కుదిరాడు. రోజులాగే బట్టీలో మధ్యాహ్నం వరకు పనిచేశాడు. భోజన సమయంలో బయటకు వెళ్లి వస్తానంటూ వంకలోకెళ్లి తిరిగిరాలేదు. తోటి కార్మికులు వెళ్లి చూడగా అక్కడున్న వేప చెట్టుకు తలపాగాతో ఉరి వేసుకుని కనిపించాడు. యజమాని మృతుడి బంధువులకు, పోలీసులకు సమాచారం అందించాడు. మృతదేహాన్ని వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించి భద్రపరిచామని, బంధువులు వచ్చిన తర్వాత ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. మద్యానికి అలవాటు పడ్డ కార్మికుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

రైతు బలవన్మరణం


సుధాకర్ (ఫైల్)

డోన్ రూరల్: మండల పరిధిలోని మల్లెంపల్లి గ్రామానికి చెందిన మద్దెపల్లి సుధాకర్(40) మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సుధాకర్ భార్యతో కలిసి సొంతంగా ఉన్న కొద్దిపాటి పొలం సాగుతో పాటు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. చివరకు వారి సొంత పొలం వద్ద చూడగా గట్టు మీద ఉన్న చెట్టుకు డ్రిప్ పైపుతో ఉరి వేసుకొని వేలాడుతుండటం చూసి వెంటనే కిందకు దించారు. అప్పటికే సుధాకర్ మృతి చెందాడు. మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలాఉండగా సుధాకర్ అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు తెలిపారు. అయితే ఆసుపత్రిలో చికిత్స అనంతరం కోలుకున్న విద్యార్థి క్షేమంగా ఇంటికి చేరిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఘటనపై ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. హుసేనాపురం గ్రామానికి చెందిన విద్యార్థి 2020–21లో కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశించాడు. విద్యార్థి ఇద్దరు సోదరీమణులు గతంలో ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందినట్లు సమాచారం. అప్పటినుంచి ఆ విద్యార్థి ఫోబియాతో బాధపడేవాడు. వైద్యుల వద్ద చూపించినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీన స్కూల్ నుంచి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో మరుగుదొడ్లు శుభ్రం చేసే హార్పిక్ ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులతో చెప్పాడు. చికిత్స నిమిత్తం కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యచికిత్సల అనంతరం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి కుదుటపడడంతో సురక్షితంగా ఇంటికి చేరుకున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

బీసీల స్వయం సమృద్ధికి రుణాలు

- నేటి నుంచి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం


జాకీర్‌హుసేన్, ఈడీ, బీసీ కార్పొరేషన్

కర్నూలు(అర్బన్): ఉమ్మడి జిల్లాలోని బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రూ.77.69 కోట్ల సబ్సిడీ రుణాలను అందించనున్నట్లు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్‌హుసేన్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయం, రవాణా, పరిశ్రమలు, సర్వీస్ (ఆటో సర్వీస్, బ్యాటరీ సర్వీసింగ్, కంప్యూటర్ సేల్స్ అండ్ సర్వీస్, ఎలక్ట్రానిక్ గూడ్స్ రిపేర్స్, ఇంజినీరింగ్ వర్క్‌షాప్), వ్యాపారాలు (బేకరి, ఆటోమొబైల్, బ్యూటీ పార్లర్, బ్రిక్ మిషన్, ఫ్లోర్ మిల్, ఐరన్ గేట్ మేకింగ్ తదితర వ్యాపారాలు) చేసుకొని ఆర్థికంగా స్థిరపడేందుకు రూ.2 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు రుణాలను అందించనున్నట్లు చెప్పారు. ఈ రుణాలకు సంబంధించి గరిష్టంగా రూ.2 లక్షలు సబ్సిడీ ఉంటుందన్నారు. అలాగే చిన్న వ్యాపారాలు, ఇతరత్రా వాటికి సంబంధించి రూ.2 లక్షల రుణానికి రూ.75 వేలు, రూ.3 లక్షల రుణానికి రూ.1.25 లక్షలు సబ్సిడీ ఉంటుందన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలో 62 మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకునేందుకు బీ ఫార్మసీ, డీ ఫార్మసీ చదివిన నిరుద్యోగులకు అవకాశం కల్పిస్తున్నామని, ఒక్కో షాపు ఏర్పాటుకు రూ.8 లక్షలు అవసరంకాగా ఇందులో రూ.4 లక్షలు సబ్సిడీ ఉంటుందన్నారు. కర్నూలు జిల్లాలో 1673 మంది బీసీలకు, 171 మంది ఈబీసీలకు రూ.31.85 కోట్ల మేర రుణాలను అందించనున్నట్లు ఈడీ వివరించారు. అలాగే నంద్యాల జిల్లాలో 2,156 మంది బీసీలకు, 171 మంది ఈబీసీలకు రూ.45.84 కోట్ల మేర రుణాలను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. వివిధ పథకాల కింద లబ్ధి పొందేందుకు 21 నుంచి 60 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో ఈ నెల 8 నుంచి 16వ తేదీలోగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అలాగే కాపు కార్పొరేషన్ ద్వారా కూడా కర్నూలు జిల్లాలో రూ.6.40 కోట్లతో 190 యూనిట్లు, నంద్యాల జిల్లాలో రూ.6.35 కోట్లతో 189 యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయన్నారు. ఇందుకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం నుంచి రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశాలు ఉన్నాయని జాకీర్ హుసేన్ తెలిపారు.

కాలుష్య నియంత్రణకు రూ.7.87 కోట్ల మంజూరు


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): కాలుష్య నియంత్రణ కోసం నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ) కింద కర్నూలు నగరానికి రూ.7.87 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ పి. రంజిత్‌బాషా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలెక్టర్ ఎన్‌సీఏపీపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. నగరంలో పచ్చదనాన్ని పెంచడం, సర్కిళ్ల వద్ద వాటర్ ఫౌంటెన్ల ఏర్పాటు, రోడ్లు ముగిసే దగ్గర చదును చేయడం, జంక్షన్లను అభివృద్ధి చేసే పనులను చేపట్టాలన్నారు. కిడ్స్ వరల్డ్ నుంచి రాజ్‌విహార్ వరకు రోడ్లకు ఇరువైపులా తారు రోడ్లు వేయాలన్నారు. సీక్యాంపు నుంచి విజ్ఞాన్ మందిర్ వరకు, విశ్వేశ్వరయ్య సర్కిల్ నుంచి రైతు బజార్‌వరకు, విజ్ఞాన్ మందిర్ నుంచి బీక్యాంపు ఆటో స్టాండ్ వరకు రోడ్లకు ఇరువైపుల దమ్ము రేగకుండా తారు వేయాలన్నారు. ఉల్చాల జంక్షన్ నుంచి పెద్దపాడు వరకు ప్లాంటేషన్‌ను చేపట్టి పచ్చదనాన్ని పెంచాలన్నారు. ఎయిర్ క్వాలిటీ వివరాలను తెలియజేస్తూ నగరంలో మూడు ప్రదేశాల్లో డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని, ప్రజలకు కాలుష్య నియంత్రణపై నిత్యం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పీసీబీ అధికారులను ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, కమిషనర్ రవీంద్రబాబు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ పి.వెంకటకిశోర్‌రెడ్డి, డీటీసీ శాంతకుమారి, డీఏఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
IV
కర్నూలు
బుధవారం ॥ 8-1-2025


మొక్కల నాటక ముందు...


మొక్కల నాటిన తర్వాత...





● అదర్ సైడ్


● శ్వేత

ఆమే వనమై...

ఎస్.పి గారి డ్యూటీ నేరాలను అరికట్టడం. భూమి మీద చెట్టు చేమా లేకుండా పోయేలా మనిషి వహిస్తున్న నిర్లక్ష్యాన్ని మించిన నేరం ఉంటుందా? దానినీ అరి కట్టాలి కదా. కామారెడ్డి జిల్లా ఎస్పీగా శ్వేత పనిచేస్తున్న కాలంలో ఒక హరిత వనాన్ని పెంచడం తన కర్తవ్యం అనుకున్నారు. ఆరు ఎకరాల్లో ఎన్నో మొక్కలు నాటించారు. ఇప్పుడది అడవిని తలపిస్తోంది. హరిత రక్షక వనంగా నామకరణం చేసుకుంది.

హరితహారం స్ఫూర్తితో తన వంతు బాధ్యతగా మొక్కలను నాటడమే కాదు వాటిని సంరక్షించాలనే లక్ష్యంతో రంగంలోకి దిగారు అప్పటి కామారెడ్డి ఎస్పీ శ్వేత. కామారెడ్డిలో ఆరు ఎకరాల స్థలంలో 80 రకాలైనవి ఎన్నో మొక్కలు నాటించారు. మొక్కలు నాటడమే కాదు వాటిని కాపాడేందుకు ఆమెతో పాటు పోలీసు సిబ్బంది నిరంతరం శ్రమించారు. ఫలితంగా ఇప్పుడు అక్కడ అడవిని తలపించే విధంగా చెట్లు పెరిగి పెద్దవయ్యాయి. మూడేళ్ల కాలంలో ప్రతీ రోజూ ఎస్పీ శ్వేత అక్కడికి వెళ్లేవారు. జరుగుతున్న పనులను పర్యవేక్షించేవారు. ప్రతీ రోజూ వాకింగ్, రన్నింగ్ అక్కడే చేసేవారు. ఈ వనానికి 'హరిత రక్షక వనం' అని నామకరణం చేశారు.

ఎనభై రకాల మొక్కలు...

స్థానికంగా పెరిగే అటవీ వృక్ష జాతులకు సంబంధించి దాదాపు 80 రకాల మొక్కలు నాటారు శ్వేత. రామ సీతాఫలం, బాదమ్, శ్రీగంధం, టేకు, ఖర్జూరం, వేప, పనస, నేరేడు, చింత, దానిమ్మ, జామ, ఈత, మేడి, మునగ, నిమ్మ, ఉసిరి, వెలగ, కుంకుడు, కదంబం, నల్లజీడి, రాచఉసిరి, జిట్రేగి... మొదలైన రకాలకు సంబంధించి ఎన్నో మొక్కలు నాటారు.

ప్రతీ మొక్కకు నీరందించడానికి డ్రిప్ ఏర్పాటు చేశారు. అక్కడ రెండు బోర్లు తవ్వించి వాటి ద్వారా నీటిని అందిస్తున్నారు. 'హరిత రక్షక వనం'లో రెండు నీటి గుంతలు తవ్వించారు. అందులో నీరు నిల్వ ఉండేలా వర్షపు నీరు ఆ గుంతలో నిండేలా ఏర్పాటు చేశారు. పై భాగాన ఉన్న గుంతలో పది అడుగుల మేర నీటి నిల్వ ఉంది. అందులో చేప పిల్లలను పెంచుతున్నారు. నీటిని నిల్వ చేయడం మూలంగా బోరుబావుల్లో భూగర్భ జల మట్టానికి ఇబ్బంది లేకుండాపోయింది.



ఆ శ్రమ వృథా పోలేదు...

'హరిత రక్షక వనం'లో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు శ్రమించారు. ఆ మొక్కలను తమ ఇంటి పెరట్లో నాటిన మొక్కలలాగే చూసుకున్నారు. మొక్కల చుట్టు పెరిగే గడ్డిని తొలగించడం, నీరు మొక్కకు చేరుతుందా లేదా చూసుకోవడం, పనికి రాని చెత్తను తొలగించడంలాంటి పనులెన్నో చేసేవారు. పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు జిల్లా పోలీసు కార్యాలయానికి వస్తే వారితో మొక్కలు నాటించేవారు. ఆ చెట్లకు వారి పేర్లతో నేమ్‌ప్లేట్లు ఏర్పాటు చేశారు.

'చెట్లు అంటే....భూమాత రాసిన కవిత్వం' అనేది భావుకతతో కూడిన మాటే కాదు బాధ్యతను గుర్తుకు తెచ్చే మాట.

వృత్తిబాధ్యత, సామాజిక బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ పచ్చటి వనాన్ని సృష్టించడం కష్టమేమీ కాదు అని నిరూపిస్తున్నారు శ్వేత లాంటి అధికారులు.

- సేపూరి వేణుగోపాలచారి,
సాక్షి, కామారెడ్డి

మానసిక స్థైర్యాన్ని ఇచ్చారు

శాంతిభద్రతలకు సంబంధించిన వ్యవహారాల్లో బిజీగా ఉంటూనే రకరకాల సామాజిక అంశాలపై స్పందించేవారు శ్వేత. కరోనా కాలంలో పోలీసు సిబ్బందిలో మానసిక స్థైర్యాన్ని కలిగించి ఎంతో మందికి అండగా నిలిచారు. నిరుద్యోగ యువతకు పోలీసు ఉద్యోగాల కోసం రాత పరీక్షలకు సంబంధించి శిక్షణా తరగతులు నిర్వహించారు. శారీరక ధారుడ్య పరీక్షలకు శిక్షణ ఇప్పించారు.

అమ్మలాంటి చెట్టు

కామారెడ్డి జిల్లా ఏర్పాటైన తరువాత కలెక్టరేట్, పోలీస్ కార్యాలయాల కోసం ఎంపిక చేసిన స్థలం దగ్గరికి వెళ్ళినప్పుడు ఈ స్థలం కనిపించి నాకు వనం పెంచాలన్న ఆలోచన వచ్చింది. పెద్ద పెద్ద భవనాలు నిర్మించినపుడు అక్కడ వాతావరణం మారిపోతుంది. చల్లబడాలంటే సమాంతరంగా చెట్లు పెంచాలి. అందుకే 2017 దసరా రోజు నేను, అప్పటి కలెక్టర్ సత్యనారాయణ గారు ఇక్కడ మొక్కలు నాటాం. కామారెడ్డికి పోలీస్ ఉన్నతాధికారులు ఎవరు వచ్చినా వాళ్ళతో అక్కడ మొక్కలు నాటించాను. నాటడంతో పాటు మా పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ వాటి సంరక్షణకు నిరంతరం శ్రమించారు. అక్కడి ఉసిరి చెట్టు దగ్గర మా అమ్మ ప్రతీ కార్తీక పౌర్ణమి రోజున పూజలు చేసి అందరికీ భోజనాలు పెట్టేవాళ్ళు. నేను బదిలీ అయినా ఒక అమ్మలా ఆ చెట్టు గుర్తుకొస్తూ ఉంటుంది.

- ఎన్. శ్వేత, ఐపీఎస్

● నృత్యోద్యమం



లండన్‌లో శివతాండవం

నాట్యం అనేది ఆహ్లాదానికే కాదు మానసిక వికాసానికి కూడా అనుకుంటే... నాట్యం అంటే సంతోషమే కాదు మానసిక స్థైర్యం కూడా అనుకుంటే... నాట్యం అనేది ఆనందతరంగమే కాదు పర్యావరణహిత చైతన్యం అంటే గుర్తుకు వచ్చే పేరు.... సోహిని రాయ్ చౌదరి....

సోహిని రాయ్ చౌదరి తండ్రి సుబ్రతో రాయ్ సితార్ విద్వాంసుడు. తల్లి ఉమా రాయ్ చౌదరి శిల్పి. కోల్‌కత్తాలోని వారి ఇంటిలో ఎప్పుడూ కళాత్మక వాతావరణం ఉండేది. నాలుగు సంవత్సరాల వయసులోనే నృత్యకారిణిగా కాళ్లకు గజ్జె కట్టింది సోహిని రాయ్ చౌదరి. భరతనాట్యం నుంచి మోహినియాట్టం వరకు ఎన్నో నృత్యాలలో ప్రావీణ్యం సాధించింది.

'మన వైదిక సిద్ధాంతాలు, పురాణాలు, ఇతిహాసాలు అన్నీ మానవతావాదం, మంచి గురించి చాటి చెప్పాయి. కోవిడ్, ఆర్థిక మాంద్యం, యుద్ధంలాంటి అనిశ్చిత కాలాల్లో అవి మనకు ధైర్యాన్ని ఇస్తాయి. ఇతరులకు సహాయపడేలా ప్రేరణ ఇస్తాయి. జీవితానికి సానుకూల దృక్పథాన్ని ఇచ్చే శక్తి మన పవిత్ర తత్వాలలో ఉంది' అంటుంది సోహిని.

వాతావరణ మార్పులపై ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఎన్నో సదస్సులలో సోహిని రాయ్ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

'వేదమంత్రాలతో కూడిన నా నృత్యప్రదర్శన ప్రకృతి గురించి, మన జీవితాల్లో దాని ప్రాముఖ్యత గురించి తెలియజేసేలా ఉంటుంది. పశుపతిగా శివుడు, అడవులు, జంతువులు, పర్యావరణాన్ని పరిరక్షించేవాడు. ప్రకృతిని మనుషులు ఎలా దుర్వినియోగం చేస్తున్నారో, విధ్వంసం సృష్టిస్తున్నారో చెప్పడానికి, ప్రకృతితో సన్నిహిత సంబంధాల కోసం శివతాండవం చేస్తున్నాను' అంటున్న సోహిని రాయ్ 'గ్లోబల్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డ్ కూడా అందుకుంది.

ప్రపంచవ్యాప్తంగా భారతీయ కళలు, సంస్కృతికి సోహిని రాయ్ చౌదరి అంబాసిడర్‌గా మారింది. యూకేలోని ఇండియన్ హైకమిషన్‌కు చెందిన నెహ్రూ సెంటర్‌లో సోహిని చేసిన శివతాండవం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శివతాండవంతో పాటు శివుడి గురించి రుషి దాస్ గుప్తా చెప్పిన విలువైన మాటలను వినిపించింది.

మార్కండేయ పురాణం, శివపురాణాలలో నుంచి ఒక కథను ఎంపిక చేసుకొని దాన్ని నృత్యరూపకంగా మలుచుకుంది. లండన్ తరువాత అమెరికా, రష్యా, జర్మనీ, స్పెయిన్... మొదలైన దేశాల్లోనూ ప్రదర్శనలు ఇవ్వబోతోంది.

'డ్యాన్సింగ్ విత్ ది గాడ్స్' పేరుతో తొలి పుస్తకం రాసిన సోహిని రాయ్‌కు రచనలు చేయడం అంటే కూడా ఎంతో ఇష్టం. ఆమె రచనల్లో మహిళా సాధికారత నుంచి రంగస్థలం వరకు, నృత్యోద్యమం నుంచి దేవదాసీల దుస్థితి వరకు ఎన్నో అంశాలు ఉంటాయి.

శక్తివాదాన్ని ప్రధానంగా చేసుకొని ఎన్నో రచనలు చేసింది. 'ఇండియన్ స్టేజ్ స్టోరీస్: కనెక్టింగ్ సివిలైజేషన్స్' పేరుతో సోహినిరాయ్ రాసిన పుస్తకం భారతీయ రంగస్థలం ఆత్మను పట్టిస్తుంది. ఈ పుస్తకం ద్వారా మన నాగరికతలోని గొప్ప సాంస్కృతిక, సంప్రదాయల గురించి తెలియజేసే ప్రయత్నం చేసింది. యూరప్‌లోని పద్దెనిమిది యూనివర్శిటీలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేసింది.


● సోహిని రాయ్ చౌదరి

'సూఫీ తత్వం, రూమీ కవిత్వం, ఠాగూరు మానవతా వాదంలో నాకు మహిళాసాధికారత కనిపిస్తుంది' అంటున్న సోహినిరాయ్ చౌదరి తన నృత్య కళను సామాజిక ప్రయోజనం కోసం ఉపయోగిస్తోంది.

● ముగ్గు ముచ్చట




నల్లబెల్లి మనోజ్ఞ
మంచిర్యాల
17 చుక్కలు, 3 వరుసలు
3 వచ్చే వరకు, సరి చుక్కలు




సి. పుష్కల,
శ్రీనగర్ కాలనీ, కడప
17 చుక్కలు, 7 వచ్చేవరకు
మధ్య చుక్క



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

● గర్భసంచి

తొలగించడమే పరిష్కారమా?!

'ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సెన్సెస్, జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంస్థ'కు చెందిన శాస్త్రవేత్తలు తాజాగా జర్నల్ ఆఫ్ మెడికల్ ఎవిడెన్స్ ద్వారా ఓ విషయాన్ని వెల్లడించారు. దేశంలోని 25 నుంచి 49 ఏళ్ల మధ్య వ్యవసాయ కూలీలుగా ఉన్న గ్రామీణ మహిళల్లో 32 శాతం గర్భసంచి తొలగింపు (హిస్టరెక్టమీ) శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నారని, ఈ శస్త్ర చికిత్సలు ప్రభుత్వ బీమా పథకాల ద్వారానే జరుగుతున్నాయని వెల్లడి అయింది. గర్భసంచి తొలగింపు శస్త్ర చికిత్సలవైపు గ్రామీణ మహిళలు ఎందుకు మొగ్గు చూపుతున్నారు?! ఏ అంశాలు వీరిని ప్రేరేపిస్తున్నాయి?! గర్భసంచి తొలగిస్తే వచ్చే నష్టమేమిటి?! అవగాహన అవసరం...

దేశంలో బిహార్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ.. రాష్ట్రాల్లోని గ్రామాల్లో హిస్టరెక్టమీ రేటు పెరగడం ఆందోళన కలిగిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. అవగాహన లోపమే ఇందుకు ప్రధాన కారణం అంటున్నారు స్త్రీ వైద్య నిపుణులు. వారు చెబుతున్న విషయాలేంటంటే..

ఖర్చుకు భయపడి...

- వ్యవసాయ కూలీలుగా ఉన్న మహిళల్లో వ్యక్తిగత శుభ్రత తక్కువ. దీనివల్ల గర్భసంచికి ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి.
- పోషకాహార లోపం వల్ల రక్తహీనత, అధిక రక్తస్రావం, వైట్ డిశ్చార్జ్, ఇన్ఫెక్షన్లు, రుతు సమయంలో వచ్చే నొప్పులను ఇంటిలో పనుల కారణంగా భరిస్తున్నారు. అయితే గర్భసంచి వాపు, సిస్టులు అనగానే క్యాన్సర్ అని భయపడుతున్నారు.
- సమస్య తీవ్రం అయినప్పుడు హాస్పిటల్‌కు రావడం, త్వరగా నయం కాకపోవడంతో పదే పదే డాక్టర్ దగ్గరకు వెళ్లవలసి వస్తుందని, దీనివల్ల ఇంటి పనులు, కూలి పనులకు ఇబ్బందులు వస్తాయని, తమ వెంట వచ్చేవారి పని కూడా పోతుందని, టెస్టులకు, మందులకు అదనపు ఖర్చు అని.. 'గర్భసంచి తొలగించుకుంటే' ఈ చికాకులన్నీ పోతాయనే ఆలోచనకు వస్తున్నారు.
- శస్త్ర చికిత్సకు ప్రభుత్వం అందించే ఉచిత పథకాల కోసం వెతుకుతున్నారు.
- గర్భసంచి సమస్యలను వాయిదా వేసుకుంటూ కూలి పనులు ఎక్కువ ఉండని వేసవి కాలాన్ని ఆపరేషన్‌కు కేటాయించుకుంటున్నారు.
- త్వరగా పెళ్ళిళ్ల అవడం, పిల్లలు పుట్టడం, త్వరగా గర్భసంచి తొలగించుకోవడం అనేది గ్రామాల్లో కూలి పనులకు వెళ్లే వారిలో తరచూ కనిపిస్తోంది.

అత్యవసర అవగాహన

- శుభ్రతకు సంబంధించిన అవగాహన అత్యవసరం.
- అధిక రక్తస్రావం సమస్యలకు కూడా పరిష్కారాలు ఉన్నాయి. హార్మోన్లకు, బలానికి వాడే మందులను అందజేయాలి.
- తప్పనిసరై గర్భసంచి తొలగించుకున్నా సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే రకరకాల ఇతర సమస్యలు తలెత్తుతాయి. దీంతో మళ్లీ హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. మధుమేహం, బలహీనత, ఎముకల సమస్యలు... వీటన్నింటి పైనా అవగాహన కల్పించాలి.

ఆర్థికంగానే కాదు ఆరోగ్యంగా ఉండటమూ దేశ భవిష్యత్తుకు కొలమానమే. వ్యవసాయ కార్మికులుగా ఉన్న మహిళలు తరచూ పురుగు మందులకు గురి కావడం వల్ల కూడా అధిక రుతుస్రావాలు, ఫైబ్రాయిడ్లు, గర్భాశయ లోపాలు, జననేంద్రియ సమస్యలకు కూడా గురవుతున్నారని నివేదికలు తెలియజేస్తున్నాయి.

- నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఏడాదికోసారి పాప్‌స్మియర్ టెస్ట్

గర్భసంచి తొలగించడం వల్ల అండాలు విడుదల కాక హార్మోన్ల పని తీరు దెబ్బతింటుంది. దీనివల్ల ఎముకలపై ప్రభావం పడి, త్వరగా కీళ్ల సమస్యలు వస్తాయి. చాలా మందిలో రకరకాల ఇన్ఫెక్షన్ల వల్ల గర్భసంచి వాపు వస్తుంది. ఫైబ్రాయిడ్స్, సిస్టులు వస్తుంటాయి. అయితే అవగాహన లేక క్యాన్సర్ వస్తుందేమో అనే భయంతో గర్భసంచి తీసేయమని కోరుతున్నారు. పాప్‌స్మియర్ స్క్రీనింగ్‌తో గర్భసంచి సమస్య ఏంటో ముందే తెలుసుకోవచ్చు. దానికి తగిన మందులు వాడితే సరిపోతుంది. 40 ఏళ్ల లోపు మహిళలకు గర్భసంచి తొలగించకపోవడమే మంచిది. హెల్త్ అవేర్‌నెస్ క్యాంప్స్, ఏడాదికోసారి పాప్ స్మియర్ టెస్టులు, కుటుంబం మొత్తానికి స్త్రీ ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చు.



- డాక్టర్ భానుప్రియ, గైనకాలజిస్ట్, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్, నిజామాబాద్



అర్థంకిగా భావిస్తున్నారు

గ్రామీణ మహిళలు ఓవర్ బ్లీడింగ్, వైట్ డిశ్చార్జ్, ఇన్ఫెక్షన్స్ వంటి సమస్యలతో మా దగ్గరకు వస్తుంటారు. ఇలాంటప్పుడు టెస్టులు చేయించుకోవడం మందులు వాడటం, పదే పదే వైద్యులను సంప్రదించడం వారికి కష్టంగా మారుతుంది. అందుకు గర్భసంచి తొలగించుకోవడం మేలేమో అనే ఆలోచన చేస్తున్నారు. సాధారణంగా 50 ఏళ్లలో మెనోపాజ్ లక్షణాలు కనిపిస్తాయి. సర్జికల్‌గా వచ్చే మెనోపాజ్ వల్ల చెమటలు పట్టడం, అలసిపోవడం, చిరాకు, హాట్ ఫ్లషెస్.. అన్నీ ముప్పైల్లోనే కనిపిస్తాయి.



- డాక్టర్ మనోరమ,
మధిర, ఖమ్మం జిల్లా

● బ్యూటిప్స్



కురుల చివరలు చిట్లుతుంటే...

చలికాలం చర్మ ఆరోగ్యాన్నే కాదు శిరోజాల సహజత్వాన్ని కాపాడుకోవాలి. లేదంటే వెంట్రుకలు పొడిబారడం, చిట్లడం, చుండ్రు సమస్య తలెత్తడం వంటివి చూస్తుంటాం. ఈ సమస్యకు పరిష్కారంగా...

అలెవెరాతో కండిషనింగ్

షాంపులు, కాలుష్యం, గాలిలో తేమ తగ్గడం.. వంటి వాటి వల్ల ఈ కాలంలో వెంట్రుకలు త్వరగా పొడిబారడం, చిట్లడం వంటివి సహజంగా జరుగుతుంటాయి. వీటి వల్ల జుట్టు నిస్తేజంగా కనిపిస్తుంది. రసాయనాల గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేసిన తర్వాత అలోవెరా జెల్‌ను జుట్టుకు పట్టించాలి. 15-20 నిమిషాల తర్వాత నీటితో కడిగేయాలి. అలోవెరా రసం జుట్టుకు కావలసినంత కండిషన్ లభించేలా చేస్తుంది.

ఉసిరితో మృదుత్వం

ఉసిరి, మందారపువ్వులు మరిగించిన కొబ్బరినూనెతో మాడుకు, వెంట్రుకలకు రాసి, మర్దనా చేయాలి. మరునటి రోజు ఉదయం తలస్నానం చేయాలి. ఈ విధంగా చేస్తే వెంట్రుకలు చిట్లడం సమస్య తగ్గుతుంది. కురుల మృదుత్వం పెరుగుతుంది.

లీగల్

నిరాశ పడద్దు... మీకు న్యాయం జరుగుతుంది

మా ఇంటి పక్కన వారు మా ఇంటికి ఆనుకొని ఎలాంటి అనుమతి లేకుండా వారి పెంట్‌హౌస్ కట్టుకుంటున్నారు. ఆ పెంట్‌హౌస్ కట్టడం వలన మా ఇంటిలోకి వెలుతురు రావడం ఆగిపోతుంది. వారు పెంట్ హౌస్ కట్టుకోవడానికి అనుమతి కూడా లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే మా ఇల్లు మా ఇష్టం, నీ కెందుకు సమాధానం చెప్పాలి అని గొడవ పడుతున్నారు. కాలనీ అసోసియేషన్ వారు మాట్లాడినా లాభం లేకుండా పోయింది. ఏం చేయాలో సలహా ఇవ్వగలరు.

- పవన్ కుమార్, హైదరాబాద్

ముందుగా మీరు వ్యక్తిగతమైన వాగ్వాదానికి చోటు ఇవ్వకండి. అది సరైనది కాదు, దాని వల్ల వివాదం పెరుగుతుందే తప్ప తగ్గదు! ఎవరి ఇంటిలో వారు నిర్మాణాలు చేసుకోవచ్చు కానీ అది పక్కవారికి ఇబ్బంది కలగకుండా, పక్కవారి హక్కులకు భంగం కలగకుండా ఉండాలి. అంతేకాక, చట్టరీత్యా నిబంధనలకు లోబడి ఉండాలి. సరైన అనుమతి లేకుండా నిర్మించే ఎలాంటి కట్టడమైనా అక్రమ కట్టడం గానే పరిగణించబడుతుంది. చట్టరీత్యా చర్యలు తీసుకుంటే అలాంటి అక్రమ కట్టడాలను తొలగించాల్సి వస్తుంది. మీరు వెంటనే మునిసిపల్ అధికారులకు ఒక ఫిర్యాదు చేయండి. అందులో మీకు కలిగే నష్టం ఏమిటి, మీ పక్కింటి వారు చేస్తున్న అక్రమ నిర్మాణం ఏమిటి, ఎందుకని ఆ నిర్మాణాన్ని అక్రమ నిర్మాణం అని మీరు అంటున్నారు వంటి విషయాలను ప్రస్తావిస్తూ రాయండి. నేరుగా వెళ్తే అధికారులు మీ ఫిర్యాదు తీసుకోలేము అనటం సహజంగా చూస్తుంటాం. అందుకే రిజిస్టర్డ్ పోస్టు ద్వారా మీ ఫిర్యాదును పంపించవచ్చు. సరైన వ్యవధిలో అధికారులు చర్యలు తీసుకోకపోతే, మీరు హైకోర్టును కూడా ఆశ్రయించి మీ ఫిర్యాదు పై చర్యలు తీసుకోవాలి అని హైకోర్టు ఆర్డరు పొందవచ్చు. అలా చేయడం ద్వారా అధికారులు సదరు అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి, నిజానిజాలు తేల్చిన తర్వాత తొలగించే చర్యలను చేపడతారు. అయితే, కోర్టు కేసులలో కొంత ఆలస్యం జరగవచ్చు. దానికి నిరాశ పడవలసిన అవసరం లేదు. చట్టరీత్యా మీకు న్యాయం జరుగుతుంది.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.